## చిన్నకథ

# అమ్మా... నిర్ణయం నీదే!

ప్రాజెక్టు వర్క్, పరీక్షలు, ఎస్పైన్‌మెంట్స్ వగైరాలతో బడలిన నా మనసు కాస్త విశ్రాంతిని కోరుకుంది. వెంటనే సిస్టమ్‌లో పాటలు పెట్టి, కళ్ళు మూసుకొని కుర్చీలో వెనక్కి వాలాను. ఒక్కసారిగా ఆలోచనలన్నీ పుంఖానుపుంఖాలుగా వచ్చి పడ్డాయి. ఈ ఆలోచనల్ని కదిలిస్తూ ఇంతలో ఒక పాట "వీడుకోలే..." అంటూ సాగింది. ఆ పాట వినగానే మనసు చివుక్కుమంది.

పొద్దున్న కాలేజీలో "ఫేర్‌వెల్" అయ్యింది. పార్టీలో చివర వేసిన పాట అదే. అది విన్న మా అందరి కళ్ళు చమర్చాయి. మా అందరికీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాలు వచ్చినందుకు ఆనందించాలో, అందరం విడిపోతున్నామని బాధపడాలో తెలియలేదు.

ఇంకా నిన్నటికి నిన్న కాలేజీలో చేరినట్టుంది. నాకు బాగా గుర్తు ఏమిటంటే కాలేజీలో జాయిన్ చేయడానికి నాన్నగారు రాలేదు. ఫీజు కట్టడానికి పెద్ద నాన్నని నాతోపాటు పంపారు. అక్కడ అందరూ తమ అమ్మ, నాన్నలతో రావ డం చూసి, ఇంటికొచ్చాక చాలా ఏడ్చాను. ఇప్పటికీ ఆ విషయం గుర్తొచ్చి నప్పుడల్లా నా కళ్లలో నీళ్ళు తిరుగుతాయి.

నా ఇంజనీరింగ్ జీవితం అంతా నిజంగా "హ్యాపీడేస్" లాగానే గడిచి పోయింది. కాలేజీలో మేం చేసిన అల్లరి ఇంతా అంతా కాదు. నా జీవితంలో నా స్నేహితులు ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఆక్రమించుకున్నారు. నాకు సంగీతమన్నా, సాహిత్యమన్నా ప్రాణం టైం దొరికినప్పుడల్లా నా స్నేహితులు నాచేత పాటలు పాడించుకుని వినడమే కాకుండా ఎంతో మంచి సలహాలు సూచించేవారు. నిజానికి పాడేవాడి కన్నా, వినేవాడికి ఎక్కువ సంగీతం తెలుస్తుంది. పాడేవాడు పండితుడైనా బాగాలేకపోతే పామరుడు కూడా వినడు అని అంటుంది అమ్మ.

నాకు సంగీతంలో మొదటి గురువు అమ్మ! ఎన్నో కళలకు నిలయమైన ఇంటి నుంచి వచ్చినదైనా, నాన్నగారికి ఇష్టం లేదని, తన అభిరుచులన్నింటినీ, ఆఖరికి తన వ్యక్తిత్వాన్ని కూడా ఆయనకి అనుగుణంగా మార్చుకుంది. నాన్నగారు ఎప్పుడూ బిజీగా ఉండే వారు. ఆయన మాతో గడిపే సమయమే చాలా తక్కువ. నేను, అక్క స్కూల్‌కి వెళ్ళిపోయాక, బందిఖానాలో ఉండే ఖైదీలా ఒక్కర్తే ఉండేది. ఆ లంకంత ఇంట్లో ఆమె వచ్చినది ఉమ్మడి కుటుంబం నుంచైనా, నాన్న కోసం ఒంటరితనం కూడా అలవాటు చేసుకుంది. ఇప్పటికీ నా మనసులో ఒక సందేహం మెదులుతూ ఉంటుంది. "తనని తాను ఇంతగా మార్చుకున్న అమ్మకోసం, నాన్న ఎప్పుడూ ఆలోచించరెందుకు" అని.

మమ్మల్ని మాత్రం క్రమం తప్పకుండా అమ్మ సంగీతం క్లాసులకి పంపేది. నాన్నగారు చదువు డిస్టర్బ్ అవుతుందని అమ్మని తిట్టేవారు. అయినా అమ్మ మాత్రం మమ్మల్ని పంపించడం మానేది కాదు.



నా ఆలోచనలకి ఆనకట్ట వేస్తూ పాట ఆగిపోయింది. కళ్ళు తెరచి చూస్తే ఎదురుగా నిలుచొని ఉంది అమ్మ. అప్రయత్నంగా నా చూపు ఆమె చేతిలో ఉన్న ఫొటో మీద పడింది. ఆమె చెప్పదలచుకున్న విషయం ఏమిటో నా కర్థమైందని గ్రహించింది తను. ఆ ఫొటో నాచేతిలో పెట్టి, అబ్బాయి పేరు ఉదయ్. అమెరికాలో పని చేస్తున్నాడని, ఐదంకెల జీతం అని, వగైరా వగైరా విషయాలన్నీ చెప్పి తను నాతో నెట్‌లో చాటింగ్ చెయ్యాలనుకుంటున్నాడని చెప్పి గదిలో నుంచి నిష్క్రమించింది.

ఇంతలో విహారి గురించి ఏదో కబురు తెచ్చింది నా సెల్. "నీతో కొంచెం మాట్లాడాలి. రేపు కాలేజీకి నేరుగా రా" అని మెసేజ్ పంపించాడు విహారి. అతను నాకొక మంచి స్నేహితుడే కాదు నా శ్రేయోభిలాషి కూడా. నిజానికి నాలో ఉన్న స్టేజ్‌ఫియర్ పోగొట్టి, కాలేజీలో గాయనిగా నాకో గుర్తింపు రావడానికి కారణం విహారి. నాలో ఆత్మస్థైర్యాన్ని నూరిపోసింది తనే. తను లేకపోతే నాకీ రోజు స్టేజ్ ఫియర్ వల్ల ఉద్యోగం వచ్చేది కాదు. ఒక విధంగా చెప్పాలంటే తను లేకపోతే నేను లేను.

కంప్యూటర్ ముందు కూర్చున్నాను ఉదయ్‌తో చాటింగ్ చేయడానికి. ఇద్దరం ఒకర్నొకరు పరిచయం చేసుకున్నాం. మాట్లాడడం మొదలెట్టిన దగ్గర్నుంచీ, తను, తన ప్లానింగ్, తన బిజినెస్, తన సెటిల్‌మెంట్ అన్నీ తన గురించే తప్ప కనీసం నా గురించి తెలుసుకోవాలని తనకి అనిపించలేదు. ఆ మాటలు విన్నాక, పెళ్ళయ్యాక నా కిష్టం లేకపోయినా బలవంతంగా నన్ను తన దార్లోకి తెచ్చుకుంటాడేమో అనిపించింది. ఆ మాటల్ని డైవర్ట్ చెయ్యడానికి అతని అభిరుచులు ఏమిటో అడిగి తెలుసుకున్నదేమిటంటే, అతనికి కళల పట్ల ఆసక్తి లేదని, అతని దృష్టిలో కళ అంటే 'టైం వేస్ట్'. ప్రతి విషయంలో నన్ను డామినేట్ చెయ్యడానికి ప్రయత్నించినట్టనిపించింది.

మర్నాడు కాలేజీలో విహారీ నాతో మాట్లాడాలనుకున్న ముఖ్యమైన విషయం ఏమిటో అడిగాను. ఆ మాటవిన్న నేను దిగ్భ్రాంతిగా నిల్చున్నాను. ఆ మాటలు చెప్పి అక్కడ నుంచి మౌనంగా వెళ్ళిపోయాడు విహారి.

రెండు రోజుల తర్వాత అమ్మతో ఈ విషయం మాట్లాడాను. "అమ్మ, విహారీ ఎలాంటి వాడో నీకు తెలుసుకదా. ఉదయ్ మనస్తత్వం ఎలాంటిదో మొన్నటితో నాకు తెలిసింది. ఇప్పుడు నీ మాట విని ఉదయ్‌ని పెళ్ళి చేసుకుంటే ఖచ్చితంగా నా జీవితం కూడా నీలాగే తయారౌతుంది. ఇప్పుడు నన్నేం చెయ్యమంటావ్? నేను మాత్రం నిన్ను నొప్పించే పని ఎన్నడూ చెయ్యను".

ఒక్క క్షణం ఇద్దరి మధ్య మౌనం రాజ్యమేలింది. అమ్మ వెంటనే నిలుచొని, ఉదయ్‌ఫొటోని చించి చెత్తబుట్టలో వేసి, తన పెదవులతో నా నుదుటిపై ఆప్యాయంగా స్పృసించి, "ఆల్ ది బెస్ట్ ఫర్ యువర్ ఫ్యూచర్" అంది.

**– టి.పి. సింధూరి**